ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
ఆదివారం 20 అక్టోబరు 2024

ఎకో పార్కు వినియోగానికి చర్యలు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మంథని, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎకో పార్కును ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ పెంట్రి రమ-సురేష్‌రెడ్డి, పాలక వర్గం చర్యలు చేపట్టారు. కొద్దినెలలుగా వినియోగంలోని పార్కు తీరుపై మంథనిలో ఆహ్లాదాన్ని పంచని ఎకో పార్కు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. పార్కును వినియోగంలోకి తీసుకురావటానికి శనివారం చర్యలు చేపట్టారు. పార్కులో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగింపు, పారిశుధ్య, పరిసరాలను శుభ్రం చేయటానికి సిబ్బందితో చర్యలు చేపట్టారు.



కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్లకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హిందూ దేవాలయాలపై దాడులను అరికట్టాలి

- విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్
- కార్పొరేషన్ ఎదుట ధర్నా

8



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు
- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

8

నాణ్యత లేని చేప పిల్లలు మాకొద్దు..

- కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు
- నాణ్యత పరిశీలించకుండానే సరఫరాకు అనుమతి
- తిరస్కరించి వాపస్ పంపిస్తున్న మత్స్యకారులు
- బదులుగా నగదు పంపిణీ చేయాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

నాణ్యత, నిర్ణీత సైజు లేని చేప పిల్లలు తమకు వద్దంటూ మత్స్యకారులు వాపస్ పంపిస్తున్నారు. చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత లేని, తక్కువ సైజుగలవి సరఫరా చేస్తున్నా కూడా సంబంధిత మత్స్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం అధికారులు కాంట్రాక్టర్లు పెంచుతున్న చేపపిల్లల ఫామ్‌ల వద్దకు వెళ్లి వాటి నాణ్యత, సైజులను కూడా పరిశీలించకుండానే సరఫరాకు అనుమతించడం అనుమానాలకు తావిస్తున్నది. నాలుగైదు రోజుల నుంచి జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్య శాఖ అధికారులు ప్రారంభించారు. చేపలను పరిశీలించిన మత్స్యకారులు వాటిని తిరిగి వాపస్ పంపిస్తున్నారు. శనివారం అంతర్గాం, పాలకుర్తి, రామగుండం, మంథని మండలాల్లోని చెరువులు, కుంటల్లో ఉచిత చేప పిల్లలను పోసేందుకు జిల్లా మత్స్య శాఖాధికారి భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో తీసుకవచ్చిన చేప పిల్లలను మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, డైరెక్టర్లు శ్రీకాంత్, పెద్దపల్లి సుజాత, పోశం, వీరస్వామి, క్రాంతి, తాళ్ల తిరుపతి, పి మొండయ్య తమకు వద్దంటూ వాపస్ పంపించారు. 35 నుంచి 40 ఎంఎం సైజు ఉండాల్సిన చేప పిల్లలు కనీసం 20 శాతం కూడా లేవని, నాణ్యత లేని చేప పిల్లలను ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. వాటిని ఎలా అనుమతించారని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తూ వస్తున్నది. చిన్నచిన్న చెరువులు, కుంటల్లో 35 నుంచి 40ఎంఎం సైజుగల చేప పిల్లలు, పెద్ద చెరువులు, రిజర్వాయర్లలో 80 నుంచి 100 ఎంఎం సైజుగల చేప పిల్లలను పోయాల్సి ఉంటుంది. వీటిని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సొంతంగా ఫిష్ పాండ్‌లు, ఫామ్‌లు, హేచరీస్ ఉన్నవారి నుంచి టెండర్లను ఆహ్వానించి ప్రతి ఏటా పంపిణీ చేస్తున్నది. ఈ చేప పిల్లలను కాంట్రాక్టర్లు నాణ్యత లేనివి, తక్కువ సైజు గల చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు ఏటా వినవస్తున్నాయి. సకాలంలో చెరువుల్లో చేప పిల్లలు పోయని కారణంగా, మత్స్య సహకార సంఘాలే పిల్లలను బయట కొనుగోలు చేసి చెరువుల్లో పోస్తున్నారు.



కాంట్రాక్టరు సరఫరా చేసిన నాణ్యత లేని చేప పిల్లలను



చేప పిల్లలను పరిశీలిస్తున్న కొలిపాక నర్సయ్య, మత్స్యకారులు

● కోటి 90 లక్షల చేప పిల్లలు పోయాలని..

జిల్లాలోని 1018 చెరువులు, కుంటలు, శ్రీపాద ఎల్లంపల్లి, పార్వతీ (సుందిళ్ల) బ్యారేజీ, సరస్వతీ (అన్నారం) బ్యారేజీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఒక కోటి 90 లక్షల చేప పిల్లలు పోయాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించినప్పటికీ, 78 లక్షల 80 వేల 205 చేప పిల్లలను సరఫరా చేసేందుకు చిలుక సురేష్, వినోద్ అనే కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. వాస్తవానికి చేప పిల్లలను జూలై 15 తర్వాత చెరువుల్లో పోయాల్సి ఉండగా, టెండర్లలో జాప్యం జరగడంతో ఇప్పటికే మత్స్యకారులు సొంతంగా డబ్బులు వెచ్చించి ప్రైవేట్‌గా సీడ్ కొనుగోలు చేసి చెరువుల్లో పోసుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చేప పిల్లలు నిర్ణీత సైజులో లేకపోవడం, నాణ్యత లేని కారణంగా వాటిని తిరస్కరిస్తున్నారు. వాస్తవానికి 35 నుంచి 40 ఎంఎం సైజు గల చేప పిల్లలు ప్రైవేట్ ఫామ్‌ల్లో ఒక చేప పిల్ల రూపాయి నుంచి రూపాయి 20 పైసలకు, 80 నుంచి 100 ఎంఎం సైజు గల చేప పిల్లలు దొరికితే, కాంట్రాక్టర్లు మాత్రం అంతకంటే తక్కువ ధరకే టెండర్లు వేసి నిర్ణీత ప్రమాణాలు పాటించడం లేదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత లేని, తక్కువ సైజుగల చేప పిల్లలను అంటగట్టి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని, ఈ వ్యవహారంపై జిల్లా మత్స్య శాఖాధికారి పట్టించుకోకుండా కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చేప పిల్లల నాణ్యత, సైజును పరిశీలించిన తర్వాతనే పంపిణీ చేయాల్సి ఉండగా, అదేమి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చేప పిల్లలకు బదులు వాటి కోసం ప్రభుత్వం వెచ్చించే సొమ్మును మత్స్య సహకార సంఘాలకు ఇస్తే చేప పిల్లలను కొనుగోలు చేసి సకాలంలో చెరువుల్లో



వాపస్ వెళుతున్న అంతర్గాంకు వచ్చిన చేప పిల్లల వ్యాన్

మిగతా 8వ పేజీలో... ..

న్యూస్ బాక్స్

కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అకౌంటెంట్ పోస్టులు (1) అసిస్టెంట్ కుక్ పోస్ట్(1) మొత్తం రెండు పోస్టులకు కాంట్రాక్టు బేసిస్‌లో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈవో మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థుల నుంచి ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్/ఇంటర్ /డిగ్రీ/సర్టిఫికెట్లతో పాటు స్టడీ, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవం సర్టిఫికెట్ సమర్పించాలని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

పాలకుర్తి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ధరణికి సంబంధించిన సమస్యలపై వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆదేశించారు. శనివారం ఆయన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ధరణితో పాటు పలు రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మీసేవా కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

● పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ● మల్లాపూర్ పాఠశాలకు 50 బెంచీల వితరణ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. శనివారం ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో విశాఖ ట్రస్ట్ ద్వారా కోఆర్డినేటర్ కాడే సూర్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాలకు 50 బెంచీలు అందజేసే కార్యక్రమంలో వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవసేన, సిబ్బంది, విద్యార్థులు వంశీకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి వంశీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో చదువులో ఎక్కువ శ్రద్ధ కనబరచలేదని, కానీ తన తాత స్వర్గీయ వెంకటస్వామి జీవితాన్ని దగ్గర్నుండి చూసిన తర్వాత తాను ఎంతో స్ఫూర్తి పొందానన్నారు. తన కంపెనీ ద్వారా నూతన ఆవిష్కరణలు చేసి పేటెంట్ కూడా పొందానని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ దేవసేన పాఠశాలకు బోర్‌వెల్ అవసరముందని కోరగా వెంటనే ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లనాయక్, బ్లాక్2 అధ్యక్షుడు కోమటి రెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు పాలకుర్తి రాజేశం గౌడ్, బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, గంధం మహిపాల్, పొన్నవేణి స్వామి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు బెంచీలు అందిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

నైపుణ్య శిక్షణతో ఉపాధి గ్యారంటీ : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు నైపుణ్య శిక్షణతో గ్యారంటీ ఉపాధి అందించే దిశగా ప్రభుత్వం పటిష్ఠ కార్యాచరణ అమలు చేస్తోందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం ఆయన టీవర్క్స్ సీఈవో జోగేందర్‌తో కలిసి పెద్దపల్లి ఐటీఐ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఏటీసీ కేంద్రాలకు టీవర్క్స్ అందించే సహకారం, ఏటీసీ కోర్సుల ద్వారా మార్కెట్‌లో యువతకు అందే ఉపాధి అవకాశాల వివరాలతో కూడిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను టీవర్క్స్ సీఈవో జోగేందర్ అందించారు. పెద్దపల్లి ఐటీఐ పరిశీలనలో ఏటీసీ కేంద్రాలలో ఎన్ని సీట్లు ఇప్పటివరకు భర్తీ అయ్యాయో వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు ప్రభుత్వం మొదటి దశలోనే 2 ఏటీసీ కేంద్రాలను మంజూరుచేసిందని, ఇందులో గల 6 కోర్సులకు పదవ తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల30లోపు అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏటీసీ కేంద్రాలలో వివిధ కోర్సులకు సంబంధించి వచ్చిన సామగ్రిని పరిశీలించారు. ఐటీఐ భవనం రిన్నోవేషన్ పనులకు ప్రతిపాదనలు అందించాలని అధికారులకు సూచించారు. తరగతి గదులలో లీకేజీలు ఉంటే వాటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఐటీఐ. ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి ఐటీఐ కేంద్రాన్ని టీ వర్క్స్ సీఈవోతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దుబ్బపల్లి వద్ద గల నిగమ ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దుర్గం గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు పడాల శ్రీరాములు, కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజం యాదవ్, లోక్ అదాలత్ సభ్యులు పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, న్యాయవాదులు మేకల తిరుపతిరెడ్డి, వొడ్నాల రవీందర్, నిగమ కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్ కాలనీలో..

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. అదనపు జిల్లా న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టూటౌన్ ఎస్సై అహ్మదుల్ల పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్పందన స్కూల్ కరస్పాండెంట్ ఓదేలు, న్యాయవాదులు సదన్‌కుమార్, భూమయ్య, చరణ్‌రెడ్డి, శ్రావణ్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవ రెడ్డి, ప్రిన్సిపాల్ రవీందర్‌రావు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చిన రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ ధర్మారం మండల కేంద్రంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాచూరి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పత్తిపాక విద్యార్థుల ప్రతిభ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత నెల సిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పత్తిపాకకు చెందిన 9వ తరగతి విద్యార్థులు కె.రిషి, ఎం, ఆర్యన్‌లు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పి నరేందర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ గౌతం, ఉపాధ్యాయులు విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు.

ఉద్యమకారులకు గ్రామస్థుల సన్మానం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ ఉద్యమకారులను శనివారం గ్రామస్థులు సన్మానించారు. మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరిస్వామి, మండల అధ్యక్షులు దామ సదయ్య, దోమ్మటి రాజేష్, దుర్శేట్టి రాజేశం, గొడ్డెటి సదయ్యలను గ్రామస్థులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సత్కరించి అభినందించారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరి మృతి




సంఘటన స్థలంలో వాహనాలు, మృతులు (ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల పరిధిలోని రాజీవ్‌రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డ ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎల్ఎండీ పోలీసులు, స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య రాజు(40), లావుడియా వాగ్య(29) ఇద్దరు సొంత బావ, బావమరుదులు. వీరిది సిద్దిపేట జిల్లా ధూలిమిట్ట మండలం కూటిగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని చర్చ్ తండాకు చెందిన వారు. గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూనే సెల్‌టవర్ కేబుల్ పనులు(ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్స్)గా రాష్ట్ర వ్యాప్తంగా పనులు చేస్తూ ఉంటారు. లావుడియా వాగ్యకు రెండు నెలల క్రితం బాబు పట్టాడు. కాగా బాబు అనారోగ్యంతో జనగామలోని ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. బాబును చూసేందుకు ఇద్దరు కలిసి ఆదిలాబాద్‌లో పనులు ముగించుకొని జనగామకు తమ మినీవ్యాన్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ వద్ద మహిళా ప్రాంగణం సమీపంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో ఓ లారీని డ్రైవర్ రాజీవ్ రహదారిపై నిలిపివేశాడు. ఇండికేటర్ లైట్స్ కూడా వేయక పోవడంతో చీకట్లో లారీ కనిపించలేదు. దీంతో మినీవ్యాన్ వేగంగా లారీని ఢీకొని కిందకు వెళ్లింది. వ్యాన్ నడుపుతున్న వాగ్యతో పాటు భూక్య రాజు వాహనంలో ఇరుక్కుపోయారు. చాలా సేపు వరకు వాహనంలోనే ఇద్దరు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు శ్రమించి ఇద్దరిని వాహనంలో నుంచి బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు ఎల్ఎండీ పోలీసులు అక్కడికి చేరుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ భూక్య రాజు, లావుడియా వాగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందారు. సొంత బావ, బావమరుదులు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడగజంగం కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం కిరాణ షాపునకు వెళ్లిన బాలిక ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లభించ లేదు. కాగా ఇదే ప్రాంతానికి చెందిన శేఖర్ అనే వివాహితుడు సైతం కనబడకుండా పోవడంతో అనుమానించిన బాలిక తల్లిదండ్రులు అతడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కత్తితో బెదరించి చోరీకి యత్నం

● నిందితుడి కోసం పోలీసుల గాలింపు

మంథని, అక్టోబర్ 19: మండలంలోని గుంజపడుగు గ్రామంలో మినీ ఏటీఎంలో ఓ దుండగుడు కత్తితో బెదిరించి చోరీకి శుక్రవారం రాత్రి విఫల యత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం..మూస రజిత గ్రామంలో మినీ ఏటీఎం నిర్వహిస్తుండగా హఠాత్తుగా ఓ దుండగుడు ముసుగు ధరించి చేతిలో కత్తితో మినీ ఏటీఎంలోకి ప్రవేశించాడు. రజితను బెదిరించి డబ్బులు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా ఆమె అరవడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. గ్రామస్థులు పట్టుకోవడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. రజిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. దొంగ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రమేష్ కోరారు.

క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు

- మోసాలకు పాల్పడుతున్న ముఠా - ఐదుగురి అరెస్టు

జగిత్యాల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు పెట్టిస్తూ ప్రజలను మోసాలకు గురిచేస్తున్న ముఠాను జగిత్యాల పోలీసులు గుట్టురట్టు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ముఠా సభ్యుల వివరాలతో పాటు మోసాలకు పాల్పడిన తీరును టౌన్ సీఐ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని అరవింద్‌నగర్‌కు చెందిన గుమ్మడి నర్సయ్య, కోయల్‌కర్ వేణు, ఆరే రాజేష్ కుమార్, కురెల బాబు, తాటిపెల్లి గ్రామానికి చెందిన కొట్టె మారుతీలతో పాటు కొంత మంది క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు పెట్టింటే ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు ఆశ చూపిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, అమాయక ప్రజలను నమ్మించి ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారం గురించి వివరిస్తూ డబ్బులు పెట్టుబడులు పెట్టిస్తూ ఈజీ మనికి అలవాటు పడ్డారు.

జిల్లా కేంద్రంలో మొదలైన ఈ దందా పెగడపల్లి మండలం బతికపెల్లి, తాటిపెల్లితో పాటు అన్ని ప్రాంతాల్లో విస్తరింపజేశారు. ఈ ముఠా సభ్యులు రెక్సాస్ ట్రేడ్ యాప్ అనే ఆన్‌లైన్ ట్రేడ్ యాప్ ద్వారా యూఎస్‌డీటీ బీఈపీ-20 అనే క్రిప్టో కరెన్సీలో లక్షలాది రూపాయలను పెట్టుబడులు పెట్టించారు. పెట్టిన పెట్టుబడి 18 నెలల్లో ఐదు నుంచి 10 రెట్లు వస్తాయని దీనికి తమది పూచికత్తు అంటూ నమ్మబలికారు. ఇలా ఎంత మందిని చేర్పిస్తే అంత లాభాలు వస్తాయంటూ వందలాది మందితో పెట్టుబడులు పెట్టించి నెలకు కొంత సొమ్మును వారికి ట్రస్ట్ వ్యాలెట్ ద్వారా చెల్లిస్తూ వ్యాపారాన్ని విస్తరించారు.

కొద్ది రోజులుగా యాప్ సరిగా పనిచేయకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠాను గుట్టు రట్టు చేశారు. శనివారం ఐదుగురితోపాటు మరికొంత మందిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా వాసులు మోసపూరిత ట్రేడింగ్ యాప్‌లో కష్టపడి సంపాదించిన డబ్బులు పెట్టుబడులు పెట్ట వద్దని కోరారు. ఇలాంటి వ్యాపారాలు చేసే వ్యక్తుల సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థులు అదృశ్యం

● కొండగట్టులో గుర్తించిన పోలీసులు



కొండగట్టు పోలీసుల అదుపులో విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని సమీకృత హాస్టల్‌లో ఉంటూ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవారం అదృశ్యమయ్యారు. రాత్రి జగిత్యాల జిల్లా కొండగట్టు హనుమాన్ ఆలయ ప్రాంగణంలో పోలీసులు గుర్తించి హాస్టల్ సిబ్బందికి అప్పగించారు. చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన ఆకుల నితీష్ (11), మానకొండూర్ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన మద్దంకుల శ్రీనివాస్ (11) వెనుకబడిన సమీకృత హాస్టల్ ఉంటు చదువుకుంటున్నారు. శుక్రవారం హాస్టల్ నుంచి ఇద్దరు చిన్నారులు చెప్పాపెట్టకుండా బయటికి వెళ్లారు. హాస్టల్ వార్డెన్, సిబ్బంది మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. మానకొండూర్ నుంచి కరీంనగర్ చేరుకున్న విద్యార్థులు జగిత్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి కొండగట్టు దిగువన దిగారు. ఓ బొమ్మల వ్యాపారికి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆరా తీసి అక్కడి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని భోజనం చేయించిన అనంతరం మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

కెరీర్

భవితకు భరోసా

నాగారం

వృత్తి విద్య శిక్షణ కేంద్రం యువత ఉపాధికి భరోసా ఇస్తోంది. నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఏడేళ్లలో 1300 మంది యువతీయువకులకు శిక్షణ ఇవ్వగా 1000 మందికి పైగా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందారు.

- నాగారంలో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం
- ఏడేళ్లుగా నిర్వహణ
- ఇప్పటి వరకు 1300 మందికి శిక్షణ
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో కొనసాగింపు



నాగారంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం

నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందుతున్న యువతులు

కోనరావుపేట, అక్టోబరు 19: కోనరావుపేట మండలం నాగారంలోని వృత్తి విద్య శిక్షణ కేంద్రం యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్న మనేని విద్యాసాగర్ రావు ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని విద్యాసాగర్ రావు యువత కోసం గ్రామంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో శిక్షణ కేంద్రాన్ని ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభించి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 2017 సెప్టెంబరు 2న శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్‌తోపాటు బైక్ మెకానిక్ కోర్సులోనూ శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు 1300 మంది యువతకు శిక్షణ ఇచ్చి 1000 మందికి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలను కల్పించి వారి భవితకు భరోసా నింపారు. శిక్షణ కేంద్రంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత శిక్షణ, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతీయువకులకు సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. శిక్షణ పూర్తయిన యువత వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిర పడ్డారు.

శిక్షణ కేంద్రం బాగుంది.

- ఎండీ సాజీనా, రాళ్లపేట



జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం బాగుంది. నేను నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందుతున్నాను. ఉచితంగా శిక్షణ, భోజన వసతి కల్పించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. సర్టిఫికెట్ పొందిన అనంతరం ఈ ఫౌండేషన్ వారే ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందడం చాలా సంతోషంగా ఉంది.

టైలరింగ్ శిక్షణ పొందుతున్నా

- గీతాంజలి, మర్తనపేట



జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రంలో నేను టైలరింగ్ శిక్షణ పొందుతున్నాను. ఇందులో అన్ని వసతులు కల్పిస్తూ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తున్నారు. సర్టిఫికెట్‌తో ఎక్కడైనా పని చేసుకోవచ్చనే భరోసా ఉంది. ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు.

ఇప్పటికి 60 బ్యాచ్‌లు పూర్తి చేశాం

- వరలక్ష్మి ఫౌండేషన్ వృత్తి విద్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి మహేష్



నాగారంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాం. ఇప్పటి వరకు 60 బ్యాచ్‌లను పూర్తి చేశాం. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలగింగ్ కోర్సులను నిర్వహిస్తున్నాం. 1300 యువతీ యువకులు శిక్షణ పొందారు. వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. నిరుద్యోగ యువతకు శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.



శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు (ఫైల్)



ఎలక్ట్రీషియన్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయులు

మానకొండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయులు చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎ ఆదిత్య అనే విద్యార్థి పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ప్రార్థన ముగిసిన తర్వాత తరగతి గదిలోకి అందరితో పాటు ఆదిత్య వెళుతుండగా ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్ క్రమశిక్షణ పాటించడం లేదంటూ తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆదిత్య కింద పడి స్పృహ కోల్పోయాడు. కంగారుపడ్డ ఉపాధ్యాయులు వెల్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థి ఆదిత్యను ఇద్దరు ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్‌లు చితకబాదిన సంఘటనపై డీఈవో జనార్దన్‌రావు శనివారం పాఠశాలలో విచారణ జరిపారు. ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగవద్దన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు



కరీంనగర్‌లో లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి



సుల్తానాబాద్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన అండర్-19 ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్, హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-19 ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మధు జాన్సన్, జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరఘునందన్‌లు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యా ర్థులకు అథ్లెటిక్స్‌లోని రన్స్, జంప్స్ త్రోస్ అంశాలలో పోటీలను నిర్వహించారు. హాకీ క్రీడలను నిర్వహించి ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సాయంత్రం విజేతలకు పతకాలను అందించారు. కార్యక్రమంలో కోచ్ మార్కండేయ, పీడీలు ఎన్నేక్, సుష్మ, సరిత, దస్తగిరి, వికాస్, గౌతమ్, విష్ణు, రాజశేఖర్, అఖిల్, మహ్మద్ తారీక్ అలీ, నారాయణ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెద్దపల్లి జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి సురేష్ అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యూనిక్ పాషా పాల్గొన్నారు.

ఆదర్శం

పుట్టిన ఊరిపై మమకారం..



చల్మెడ లక్ష్మీనర్సింహరావు

- మల్కపేటలో ఆధునిక వసతులతో పాఠశాల భవనం
- నిర్మాణం చేపట్టిన చల్మెడ కుటుంబ సభ్యులు
- గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనులు



పాఠశాల గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు వివిధ రకాల బొమ్మలు

కోనరావుపేట, సెప్టెంబరు 19 : పుట్టిన ఊరిపై మమకారంతో భవిష్యత్ తరాలకు ఆధునిక వసతుల మధ్య విద్యనందిస్తున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో మాజీ న్యాయశాఖ మంత్రి చల్మెడ ఆనందరావు కుటుంబ సభ్యులు ఆయన తన తల్లి జానకి దేవి జ్ఞాపకార్థం సుమారు రెండు కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా భవనాన్ని ప్రారంభించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నారు. మల్కపేట గ్రామ విద్యార్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు.



మల్కపేటలో నిర్మించిన ఆధునిక పాఠశాల భవనం

గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తపన

- చల్మెడ ఆనందరావు, మాజీ మంత్రి



మల్కపేట గ్రామంలో పుట్టి పెరిగిన మా కుటుంబానికి గ్రామాన్ని ఏదో విధంగా అభివృద్ధి చేయాలనే తపన ఉంది. అందుకే ఆధునిక సౌకర్యాలతో పాఠశాల భవనం నిర్మించాం. శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మహిళా సంఘం భవనానికి నిధులు కేటాయించాం. మల్కపేట కట్టపై ఆరు కోట్లతో రామాలయ నిర్మాణం చేపట్టాం. అది త్వరలో పూర్తి చేస్తాం.

నలుగురు దొంగల అరెస్ట్

● నాలుగు బైక్‌లు స్వాధీనం

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బైక్‌లు దొంగిలించి విక్రయించడానికి తీసుకెళ్తుండగా శ్రీరాంపూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన అజ్మీరా అక్షయ్ కుమార్, దొంతుల ప్రశాంత్, దేవ సహాయం సెల్వ, చిట్యాల పృథ్వీ అను నలుగురు యువకులు బైక్‌లపై గోదావరిఖని వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తూ జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వెంటనే వారిని ఆపి డాక్యుమెంట్లు చూపించాలని కోరగా, వారు ఎలాంటి వాహన పత్రాలు చూపలేదు. దీంతో అదుపులోకి తీసుకొని విచారణ చేయగా, నలుగురు యువకులు గత నెల రోజులుగా ఎలాంటి పని లేకుండా, చెడు అలవాట్లకు, జల్సాలకు బానిసయ్యారని తెలిసింది. డబ్బు కోసం శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలలో నాలుగు బైక్‌లను దొంగిలించారు. వాటిని గోదావరిఖనిలో విక్రయిస్తే దొంగతనం బయటపడుతుందని భావించి మంచిర్యాలలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా, శ్రీరాపూర్ జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. బైక్‌లను స్వాధీనపర్చుకొని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ వివరించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్నలను ఏసీపీ అభినందించారు.

దత్తాత్రేయస్వామి ఆలయానికి బోటు సౌకర్యం

- ఎంపీ నిధులతో కొనుగోలు



బోటులో ప్రయాణిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరద వెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బోటు సౌకర్యం కల్పించారు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్ విస్తరించి ఉండడంతో నిత్య పూజలకు ఇబ్బందులు తలెత్తేవి. కొద్ది నెలల క్రితం దత్తాత్రేయస్వామి గుట్టపై జరిగిన స్వామి వారి జయంత్యుత్సవాలకు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శించుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బండి సంజయ్ దృష్టికి ఆలయ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన బండి సంజయ్ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యం కోసం రూ.10 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో బోటును కొనుగోలు చేసి శనివారం ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బోటును ప్రారంభించి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మిడ్‌మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్ఎండీ ప్రాజెక్టుకు రెండు గేట్ల ద్వారా 4,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల ప్రస్తుతం 317.17, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు పస్తుతం 26.86 టీఎంసీల మేర ఉంది.

ఎస్‌యూ వీసీగా ఉమేష్ కుమార్ బాధ్యతలు



వీసీగా బాధ్యతలు తీసుకుంటున్న ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం ఉపకులపతిగా శనివారం హైదరాబాద్ సచివాలయంలో ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌ను సచివాలయంలో కలసి ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాతవాహన యూని వర్సిటీ సిబ్బంది వీసీ ఉమేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆచార్య ఉమేష్‌కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణానికి రానున్నారు.

రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారుగా ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత



గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతకు ఇందులో చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం ఉత్వర్వులు జారీ చేశారు. ఆమె 22 ఏళ్లుగా సోషియాలజీ బోధిస్తున్నారు. సూరేపల్లి సుజాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దళిత మహిళా సాధికారతపై పీహెచ్‌డీ చేశారు.

జాతీయస్థాయి క్యాంపునకు ఎంపికైన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన పది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో నిర్వహించబడే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శనివారం తెలిపారు. అక్టోబరు 22నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ అడ్వెంచర్ క్యాంపునకు కంటిన్జెంట్ లీడర్‌గా ఎస్ఆర్ ఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి వ్యవహరిస్తున్నారు. ఎంపికైన వలంటీర్లను శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ రాజేశం, డాక్టర్ అర్జున్, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి క్యాంపునకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అదివారం ప్రత్యేకం

కార్పొరేట్ చాయ్

'సూడు...సూడు మని..చుట్టం ఇంటికి వస్తే చాయ బొట్టు పోద్దామంటే కసికెడన్ని పాలు కూడా లేక పాయే'..

అనే మాటలు గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వినిపించేవి. ఈ మాటలు చాయ మారుమూల పల్లె ప్రజల పానీయంగా మారి వారి జీవితాలతో ఎలా పెనవేసుకొని పోయిందో దర్పణం పడుతున్నాయి. కాస్మోపాలిటన్ నగరం నుంచి పల్లెటూరి ప్రజల వరకు చాయ తాగందే తెల్లవారదు. చాయ మన భారతీయ పానీయం కాదు.. బ్రిటిష్ వాళ్లు మనల్ని పాలించిన సమయంలో అది దేశంలోకి ప్రవేశించి ఇక్కడి ఆహారపానీయాల్లో ఒకటిగా కలగలిసి పోయింది. ఇంటికి మిత్రులో... చుట్టాలో వస్తే మంచినీరు, చాయ అందించడం కనీస మర్యాదగా మారిపోయింది. దీంతో ఊరూరా..నగరాల్లో వాడవాడనా...చాయ్ దుకాణాలు వెలిశాయి. ఉదయం పూట మాత్రమే చాయ్ తాగే అలవాటు ఉండేది. క్రమేపీ సాయంత్రం టీ తాగడం అలవాటైంది. ఇప్పుడు ఒక్కొక్కరు నాలుగైదేసి సార్లు తాగనిదే రోజు గడవని స్థితికి చేర్చింది.

◆ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్





- అందుబాటులోకి వివిధ రకాల టీలు
- రూపుమారిన టీ కొట్లు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

ప్రజలు చాయ్ తాగకుండా ఉండలేని తనాన్ని కార్పొరేట్ రంగం తన వ్యాపారంగా మార్చుకున్నది. ఎవరు చాయ్ చేసినా తేయాకు మాత్రమే వినియోగించాల్సి ఉన్నా కార్పొరేట్ రంగం రకరకాల బ్రాండ్ ఇమేజ్‌లను సృష్టించి వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించింది. పూర్వకాలంలో గుడిసె హోటళ్లలో బొగ్గుల పొయ్యి మీద చాయ కాచి కేతిర్లలో నిలువచేసి అమ్మేవారు. ఆ తర్వాత చిన్నచిన్న హోటళ్లు వెలిశాయి. ఆ తర్వాత చాయ డబ్బాలు వచ్చాయి. ఇప్పుడు ఆ చాయ కాస్త రకరకాల బ్రాండ్ పేర్లతో సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రజలను ఆకర్షిస్తున్నది. మార్కెట్‌లో చాయ్ వాలా, బాబాయ్, టీ పాయింట్, టీ టైం, ఆర్మీ వాలా చాయ్, బెల్లం చాయ్, అమృతతుల్య, టీ కింగ్స్, ఇండియన్ కింగ్స్ వంటి ఎన్నో పేర్లతో ప్రత్యేక టీస్టాళ్లు వెలిశాయి. ప్రజలకు కొత్తకొత్త కార్పొరేట్ రుచులను చూపిస్తున్నాయి. ఈ స్టాళలను ఏర్పాటు చేయడానికి నిర్వహకులు మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలు ఆయా కంపెనీలకు చెల్లిస్తే టీపాయింట్ ఏర్పాటు చేసుకోవడానికి ఒక సెటప్‌ను ఇచ్చి టీ చేయడంలో శిక్షణ కూడా ఇస్తారు. తమకు మాత్రమే సొంతమైన రుచిగల టీ పౌడర్‌ను సమకూర్చుతారు. ఆ టీపొడర్‌ను వాడి మాత్రమే టీ తయారు చేయాల్సి ఉంటుంది. కార్పొరేట్ టీపాయింట్లు రావడంతో అంతకుముందే విస్తరించి ఉన్న రాజస్తాన్ టీస్టాళ్ళవారు, ఇతర టీకొట్లు కొత్తకొత్త రుచులను అందించి తమ గిరాకీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అంటూ కొత్తకొత్త టీ తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నారు.



టీ తాగుతున్న నగరవాసులు



● ఎన్నో రకాలు

దమ్‌టీ, జింజర్‌టీ, గ్రీన్‌టీ, బేసిల్ టీ, బెల్లం టీ, పింక్ టీ, లెమన్‌గ్రాస్ టీ, ఇమ్యూనిటీ టీ, లెమన్ టీ, తులసీ టీ, మసాలా టీ, కుల్లాడ్ టీ, బ్లాక్‌టీ, కశ్మీరి చాయ్, ఇరానీ టీ, కాఫీ, సూపర్ హెర్బ్ అశ్వగంధ్‌టీ వంటి టీ లను ఇస్తూ ప్రజలకు కొత్త రుచులు చూపుతున్నారు. గతంలో టిఫిన్, భోజన హోటళ్లలో టీ తయారు చేసి ఇచ్చే వారు. ఇప్పుడు వారు కాస్తా తమకు అనుబంధంగా టీ దుకాణాలను ఏర్పాటు చేయించి వారి నుంచి కొంత కమీషన్ తీసుకొని చాయ అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. కార్పొరేట్ టీ పాయింట్లలో ప్రత్యేక రుచి ఉండడంతో వాటిని నచ్చిన వారు ఆ ప్రత్యేక టీ పాయింట్లకే వెళ్లి టీ తాగుతుండడంతో కొన్ని టిఫిన్ సెంటర్లలో చాయ, కాఫీ ఇవ్వడం మానేశారు. మొత్తానికి బ్రిటీష్ వాళ్ళు ఫ్రీగా అందించి అలవాటు చేసిన టీ ఇప్పుడు కార్పొరేట్ రుచులతో ప్రజల అందుబాటులోకి వచ్చింది.



బెల్లం టీని ఎక్కువ ఇష్టపడుతున్నారు.

-బి రవి, బెల్లం టీ బ్రాంచెస్ నిర్వాహకుడు

ప్రతిరోజు 600 వరకు బెల్లం టీలు అమ్ముతాం. ఎక్కువగా రిటైర్డ్‌ఎంప్లాయిస్, యువత బెల్లం టీ ని ఇష్టపడుతున్నారు. బెల్లం ఆరోగ్యానికి మంచిది. చాయపత్తి, యాలకుల పొడి, బెల్లం పౌడర్ కలిపి కంపెనీ పంపిస్తుంది. ప్రతి 10 రోజులకు ఒకసారి ఆర్డర్ చేస్తాం.

మట్టి కప్పుల్లో స్పెషల్ టీ

- జె అంజయ్య, ఆర్మీ చాయ్ బార్ నిర్వాహకుడు

రెండు సంవత్సరాల క్రితం ఆర్మీ చాయ్ బార్ ఏర్పాటు చేశాం. బాగా నడుస్తుంది. మట్టి కప్పుల్లో టీని ఇస్తాం. ప్రతిరోజు 500 వరకు టీలు అమ్ముతున్నాం.

లాభాలు బాగానే ఉన్నాయి...

- కూస శేఖర్, కలెక్టరేట్ టీ టైం

కలెక్టరేట్ ప్రాంతం కావడంతో లాభాలు బాగానే ఉన్నాయి. టీ టైం కంపనీకి 4.5 లక్షలు చెల్లించి వ్యాపారం చేసుకుంటున్నాం. ప్రతీ నెలా ఆర్డర్ చేస్తే మెటీరియల్ వాళ్లే పంపిస్తారు. షాపు నిర్వహణ కోసం ఓ పెట్టర్ కిరాయి తీసుకున్నాం... నా ద్వారా కొందరు ఉపాధి పొందుతున్నారు.

చాయ్ చాలా బాగుంది..

- మల్లేశ్

చాయ్ చాలా ఉంది. ఎప్పుడు వచ్చినా ఇక్కడే తాగుతా. ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుంది. నాణ్యత, ప్రమాణాలతో కూడిన తేనీరు అందిస్తున్నారు.

ఇరానీ చాయ్‌కు ప్రాధాన్యం

-షాహిద్‌ఖాన్, ఎల్లో కేఫ్ నిర్వాహకుడు

విద్యాసంస్థలకు నిలయమైన ముఖరంపురలో విద్యార్థులు, యువత ఇరానీ చాయ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. పాలను బాగా మరగబెట్టి నాణ్యమైన చాయ్‌పత్తాలను వాడి చాయ్ తయారు చేస్తాం. పాలకు కూడా గిరాకి ఉంటుంది. బాగా మరిగిన పాలతో రుచి ఉంటుంది.

13 రకాల టీని అమ్ముతున్నాం..

-నితీష్‌కుమార్, అమృతతుల్య టీ సెంటర్

సుమారు 13 రకాల టీ అమ్ముతున్నాం. గిరాకీ బాగా ఉంటోంది. ఎందరో ఈ రకరకాల చాయలను ఆస్వాదిస్తున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా చాయలను అప్పటికప్పుడు తయారు చేసి ఇస్తాం.

నేడు సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈసమ్మేళనానికి వెయ్యిమంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు సహకార భారతి రాష్ట్ర సమ్మేళన ప్రముఖ్ న్యాలమడుగు శంకరయ్య తెలిపారు. మహాసభలకు సహకార భారతి జాతీయ సంఘటన మంత్రిసంజయ్ జీ పాచ్పోర్, సహకార భారతి జాతీయ మంత్రి నందినీరాయ్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు.

పోలీసు కుటుంబాలకు చెక్కులు అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు భద్రత పథకం కింద ఆర్థిక సహాయం చెక్కులను శనివారం అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ అందజేశారు. సీసీఆర్‌బీలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన కె లింగారెడ్డికి భద్రతా విభాగం నుంచి మంజూరు అయిన 16 లక్షల చెక్‌ను అతని భార్యకు అందజేశారు. అలాగే ఏఆర్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఎం శ్రీనివాస్ కుటుంబానికి 8 లక్షలు, ట్రాఫిక్ కానిస్టేబుల్ టి కుమార స్వామి కుటుంబానికి 8 లక్షల రూపాయల చెక్‌లను వారి భార్యలకు అందజేవారు. ఈ కార్యక్రమంలో సీపీఓ, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి పాల్గొన్నారు.




చెక్కులను అందజేస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ


కేంద్ర మంత్రిపై ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి అప్రజాస్వామికమని బీజేపీ సీనియర్‌నాయకుడు కొట్టె మురళీకృష్ణ అన్నారు. నిరుద్యోగులకు సంఘీభావంగా గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతు తెలిపిన కేంద్ర మంత్రిని అరెస్టుచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అవగాహన రాహిత్యంతో వివిధ వర్గాల ప్రజలు వేలమంది రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారన్నారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడే అర్హత కేటీర్‌కు లేదన్నారు. జీవో నెంబర్ 29తో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగాల ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గ్రూప్-1 బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వారితో చర్చలు జరపాలన్నారు. రిజర్వేషన్లను రద్దు చేసి బడుగు బలహీన వర్గాల నిరుద్యోగుల పొట్ట కొట్టడమే లక్ష్యంగా జీవో29ని తీసుకువచ్చారన్నారు.

స్మార్ట్ కార్డులు వచ్చేశాయ్..

● ప్రారంభమైన ఆర్సీల ప్రింటింగ్ ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలగనున్న ఇబ్బందులు





తిమ్మాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత తీరనుంది. రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత కారణంగా గత నెల 29 నుంచి ఆర్సీ కార్డుల ప్రింటింగ్ నిలిచిపోయింది. 'స్మార్ట్ కార్డుల కొరత శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 14వ తేదీన కథనం ప్రచురితమైంది. ఈ స్మార్ట్ కార్డుల కొరత అనేది కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొని ఉంది. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌లోని డీటీసీ కార్యాలయంతో పాటు హుజూరాబాద్, పెద్దపల్లి, రామగుండం, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల ఆర్టీవో కార్యాలయా పరిధిలో కూడా ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం ప్రతీ రోజు సుమారు వెయ్యి వరకు దరఖాస్తులు వస్తుంటాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లకు కార్డులు కొంత మేరకు అందుబాటులో ఉన్నా ఆర్సీ కార్డులు కొరత ఉంది. గత నెల 29 నుంచి ఆర్సీకార్డుల ప్రింటింగ్ కూడా కార్యాలయాల్లో నిలిచిపోయింది. దీంతో కొత్త వాహనాలకు నంబరు ప్లేట్లు బిగించుకోవడానికి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం నాలుగు వేల స్మార్ట్ కార్డులు రవాణా శాఖా కార్యాలయాలకు చేరుకున్నాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న ఆర్సీ కార్డులతో పాటు ప్రస్తుత ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల ప్రింటింగ్ పూర్తి చేసి వాహనాదారులకు పంపించే పనుల్లో రవాణా శాఖా సిబ్బంది నిమగ్నం ఉన్నారు. కార్డులు ప్రింటింగ్ అవుతుండడంతోనే వాటిని సంబంధిత వాహనా దారులకు పోస్ట్ ద్వారా పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించారు. మరో రెండు, మూడు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న కార్డులను ప్రింటింగ్ పూర్తి చేసి పోస్ట్ ద్వారా సంబంధిత వాహనాదారులకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

స్వామివారిని దర్శించుకున్న దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు



ధర్మపురిలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



యమధర్మరాజు ఆలయం వద్ద పూజలు చేస్తున్న రామకృష్ణారావు

ధర్మపురి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం స్వామి వారలకు వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. రావి చెట్టు అంజనేయ స్వామి విగ్రహం చుట్టు ప్రదక్షిణాలు చేశారు. క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం రామకృష్ణారావు కుటుంబ సమేతంగా శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దపల్లి డీఎల్పీవో వేణుగోపాల్ అన్నారు. శనివారం మండలంలోని అప్పన్నపేటలో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీలో పలు రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

నియామకం

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిలింగ్ ఫర్ ఇండియా (హెచ్ఆర్‌సీఐ) జిల్లా అధ్యక్షులుగా కొండల రాజేందర్‌కుమార్ నియామితులయ్యారు. చైర్మన్ చెన్నూపాటి శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి నర్సింహులు ఉత్తర్వులు జారీచేశారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

కమాన్‌పూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి, గుండారంల్లో 2025-28 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ గ్రామసభలు పంచాయతీ కార్యాలయాల్లో శనివారం జరిగాయి. ఆయా గ్రామాల్లో చేపట్టే పనుల గుర్తింపుపై చర్చించారు. ఈ సభలో ఎంపీడీవో లలిత, ఏపీవో లావణ్య, పంచాయతీ కార్యదర్శులు అంబటి శంకర్, బచ్చల ప్రసాద్, అఖిల ఉన్నారు.

మంత్రి చొరవతోనే కుల గణన

సుల్తానాబాద్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతోనే రాష్ట్రంలో బీసీల కుల గణన సమస్య పరిష్కారానికి నోచుకోనుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం తాను హైదరాబాద్‌లో మంత్రిని కలిసి రిజర్వేషన్లపై చర్చించి శుభాకాంక్షలు తెలిపానన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపునారాయణపేట నుంచి ఇందుర్తికి బీటీ రోడ్డు మంజూరు రూ.2కోట్లు కేటాయించడంపై రూపునారాయణపేటలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయరమణరావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, డైరెక్టర్ బోంగోని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ అంకం రమేష్, సిరిసేట్టి రాహుల్, నీర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


వంటా వార్పు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజలను, రైతులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనగామలో రైతుల సమస్యల పరిష్కారం కోసం శివారులోని గోదావరినది పక్కన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను, అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇటీవలి కాలంలో గోదావరి నది పూర్తిస్థాయిలో ఎడారిగా మారడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటిని విడుదల చేయకపోవడంతో గోదావరి నదిలోకి నీరు రావడం లేదని, వెంటనే ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయలన్నారు. గతంలో గోదావరిలో నీరు ఉన్న సమయంలో రైతులు మోటార్ల ద్వారా నీటిని తీసుకునే వారని, పొలాలు కోతకు వచ్చిన సమయంలో గోదావరిలో చుక్క నీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం ప్రాజెక్టుల రిపేరు పేరుతో నీటిని వదలకుండా కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి నది నిండు కుండలా ఉందని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో గోదావరి ఎడారిగా కనిపిస్తోందని విమర్శించారు. ఇప్పటికే హైడ్రా పేరుతో పేద ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్డున పడేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఖరి వలన అన్ని వర్గాల ప్రజలు గోస పడుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎవరు అడగని పనులను చేస్తూ దుర్మార్గమైన పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎంత సేపు కేసీఆర్‌ను బదనాం చేసే విధంగా మాట్లాడటం తప్ప ప్రజాసమస్యలపై మాట్లాడటం లేదన్నారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు జనగామ కవిత సరోజిని, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు గోపు ఐలయ్యయాదవ్, అచ్చే వేణు, తోకల రమేష్, నూతి తిరుపతి, బొడ్డు రవీందర్, తోట వేణు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పాఠశాలను నడిపించొద్దు : ఏఐఎస్ఎఫ్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): సెలవు రోజు ఆదివారం పాఠశాలలను ప్రత్యేక తరగతుల పేరిట కొనసాగిస్తే చూస్తూ ఊరుకోమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సెలవు దినం ఉన్నప్పటికి కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాలలను నడుపుతున్నారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా జీవోలను తుంగలో తొక్కుతూ సెలవు దినం రోజున కూడా పాఠశాలలను నడుపుతూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల మానసిక స్థితిగతులను పట్టించుకోకుండా జీపీఏలే లక్ష్యంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో కార్యాలయాలను ముట్టడిస్తామని, అలాగే తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ కార్పొరేషన్ ఎల్కపల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షులు మాతంగి సాగర్, కల్వల సునీల్, గొడిసెల ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో ఉచిత చేప పిల్లల పంపిణీని అడ్డుకున్న మత్స్యకారులు

మంథని, అక్టోబర్ 19: ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మంథని మత్స్య కారులు శనివారం అడ్డుకున్నారు. స్థానిక తమ్మ చెరువులో ఉచిత చేప పిల్లలను వదిలిపెట్టడానికి అధికారులు రాగా, సైజ్ తక్కువగా ఉందని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ పోతరవేన క్రాంతి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసి వాటిని వెనక్కి పంపారు.

భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలం పత్తిపాక క్రాస్ రోడ్డు వద్ద గంధం ప్రశాంత్ ఏర్పాటు చేసిన భూసార పరీక్ష కేంద్రాన్ని శనివారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా గంధం ప్రశాంత్‌ను అభినందిస్తూ మండల రైతులు భూసార పరీక్షా కేంద్రాన్ని ఉపయోగించుకొని నేలసారం అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

కేశోరాం కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

పాలకుర్తి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో గతంలో కార్మిక సంఘం అధ్యక్షుడిగా పనిచేసి పలు సేవలు అందించిన ఎండీ జలీల్‌ఖాన్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు.

అక్రమాలపై చర్యలు చేపట్టాలి

మంథని, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): మంథని-గోదావరిఖని ప్రధానరహదారి సమీపంలో గౌడ్స్, పద్మశాలిలకు ప్రభుత్వం ఇచ్చిన నివాస స్థలాల కేటాయింపులో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీకి శనివారం ఫిర్యాదు చేసినట్లు ఆరెల్లి కిరణ్, బెజ్జంకి డిగంబర్, బూడిద తిరుపతిలు తెలిపారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 19: అన్ని దానాల్లోకెల్లా నేత్రదానం గొప్పదని రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పీ మల్లికార్జున్, జోన్ చైర్మన్ కజాంపురం రాజేందర్, సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ అన్నారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి శ్యాంసుందర్‌శర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. నేత్రదాత శ్యాంసుందర్‌శర్మకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులు నేత్ర, అవయవ, దేహదానంపై అవగాహన కల్పించారు. అపోహలు వీడి, నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అనంతరం నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నేత్రదాత కుటుంబ సభ్యులు ప్రేమ్‌లత శర్మ, ఉమేష్ చందర్ శర్మ, రాజేష్ కుమార్‌శర్మ, లయన్స్ క్లబ్ జోన్ ప్రతినిధులు రామస్వామి, బేణి గోపాల్ త్రివేది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం

ఓదెల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 3,5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మహిళ కమిషన్ సభ్యులు కటారి రేవతిరావు, సుధ లక్ష్మీల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అలాగే చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. కస్తూర్బా పాఠశాలలో తనిఖీ నిర్వహించి విద్యార్థుల సామర్థ్యతను పరీక్షించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గోపగోని స్వరూప, రాజేశ్వరి, ఉమాదేవి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : పూసాలకు చెందిన వెంగల హర్షిత ఇటీవల తండ్రిని, అంతకు ముందు తల్లిని కోల్పోయింది. హర్షితకు మిర్యాలగుడ జేఎన్‌టీయూలో సీటు వచ్చింది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో సుల్తానాబాద్‌కు వాసాల శ్రీలత-శ్రీనివాస్ దంపతులు శనివారం హర్షితకు రూ.5వేలు అందించారు.

సెగ్రిగేషన్ షెడ్లలను వినియోగించాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లను సద్వినియోగపరచాలని పెద్దపల్లి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని గౌరెడ్డిపేట, రాంపల్లి, భోజన్నపేట, మూలసాల, కొత్తపల్లి, పెద్దబొంకూరు గ్రామాల్లో పర్యటించారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశాన వాటికలు, అవెన్యూ ప్లాంటేషన్, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. వెంట పంచాయతీ కార్యదర్శులు శైలజ, సురేందర్‌రావు, పుట్ట శ్రీనివాస్ ఉన్నారు.

హిందూ దేవాలయాలపై దాడులను అరికట్టాలి

కోల్‌సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో హిందూ దేవాలయాలు, హిందువులపై దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్ డిమాండ్ చేశారు. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖనిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా జరిపారు. ఈ ధర్నాను ఉద్దేశించి విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్ మాట్లాడారు. అనంతరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్లు రాజు, రాయలింగులకు వారు వినతిపత్రం అందించారు. వీహెచ్‌పీ నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ సంపత్‌యాదవ్, అడిగొప్పుల రాజు, వెంకటస్వామి, మునగాల సంపత్, లింగన్న, కుంభార్ దిగంబర, అజయ్, దుర్గా వాహిణి, తిరుమల, అన్నపూర్ణ, భవాని, దువాసి తిరుపతి, పైతరి రాజు, పున్నం శశికుమార్, అనిరుధ్, రాజేష్, చక్రవాణితో పాటు 300మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ధర్మారం మండలంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియను, తనిఖీ చేశారు. బొమ్మరెడ్డిపల్లిలో సర్వే నంబర్ 375లోని ప్రభుత్వ భూమి 23 ఎకరాల 8 గుంటల సర్వే పనులను పరిశీలించారు. ఖిలావనపర్తిలో ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ పూర్తయిందని, బొమ్మరెడ్డిపల్లిలో అదనపు బృందాలను ఏర్పాటుచేసి పూర్తిచేయాలని సూచించారు. వెంట అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ ఆరీఫ్, ఆర్ఐలు వరలక్ష్మీ, నవీన్‌రావు, సర్వేయర్ శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

బేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో స్టడీ కార్నర్

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్టడీ కార్నర్‌ను డీఈవో లత ప్రారంభించారు. గణిత ఉపాధ్యాయుడు మల్కరాంకిషన్‌రావు, తులసీరావు, రవితేజ, శ్యామల సహకారంతో రూ.50 వేల స్టడీ కార్నర్‌ను ఏర్పాటుచేయగా డీఈవో మాధవి లత చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం లూర్దుమేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతం రంగు పులమడం సరికాదు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఉర్దు కవి మగ్దుం మొయినోద్దీన్ రంగ స్థలాన్ని మతం రంగు పులమడం సరికాదని సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అన్నారు. శనివారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత మున్సిపల్ కార్యాలయంవద్ద ఉన్న రంగ స్థలానికి కొంత మంది మతోన్మాదులు పేరు మార్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. కార్మికవర్గం కోసం పేదల కోసం మగ్దుం కృషి చేశారని, ఆయన పేరిట అప్పటి గ్రామపంచాయతీ సర్పంచ్ గీట్ల జనార్ధన్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు మాదిరెడ్డి భాస్కర్‌రావు రంగస్థలాన్ని ఏర్పాటు చేశారన్నారు. స్వతంత్ర చౌక్‌లో ఉన్న మగ్దుం రంగ స్థలం పేరును మార్చితే ఊరుకునేది లేదని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, తాళ్లపల్లి మల్లయ్య, అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, తొడుపునూరి రమేష్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ అన్నారు. సుల్తానాబాద్ సహకార సంఘం నూతన సమావేశ మందిరంలో ఏర్పాటు శనివారం సుల్తానాబాద్ సర్కిల్‌పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో, కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుల్తానాబాద్ ప్రాంతంలో వరి కోతలు ముందుగానే ప్రారంభించిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని 8 సహకార సంఘాల పరిధిలో మొత్తం 57 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌలభ్యం కోసం హమాలీల కోసం టెంట్లు వేయించాలని, త్రాగునీటి వసతి కల్పించాలని, కుర్చీలు ఉంచాలని సూచించారు. రైతులకు 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సహకార సొసైటీల ఉద్యోగులు సిబ్బందితో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వయంఉపాధి, రక్షణపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వయంఉపాధి, విద్య, ఆరోగ్య, గృహ సంబంధిత అంశాలపై శనివారం జిల్లా సంక్షేమ అధికారి, వేణుగోపాల్, జిల్లా పర్యవేక్షకులు, రాజయ్య ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కల్పించారు. జిల్లాలో ట్రాన్స్ జెండర్లకు రక్షణ, సౌకర్యాలు కల్పిస్తామని సూచించారు. జిల్లా మహిళ సాధికారత కేంద్ర బృందం సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, సమస్యలపై, సామాజిక భద్రత, ఆర్థిక సమస్యలు, స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, బ్యాంక్ రుణాలు, జీవిత భీమలు, ఆధార్‌కార్డు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీడీపీవో అలేఖ్య పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ కె.అనిల్ కుమార్, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ కౌన్సిలర్ సీహెచ్. సమత, ట్రాన్స్ జెండర్స్ జిల్లా అధ్యక్షురాలు కామేశ్వరి, కావ్య, సాలోని, లాస్య, అలకనంద, ధరణి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనలో క్రియాశీల పాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలోని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధనలో యూనియన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాడని మండల బీఆర్ఎస్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు తెలిపారు. బసంత్‌నగర్‌లో వారు మాట్లాడుతూ.. యూనియన్ గెలిచిన అనతికాలంలోనే అధికారులు, కార్మికులను సమన్వయపరుస్తూ కార్మికుల హక్కులను సాధిస్తున్నాడన్నారు. అనారోగ్యాలకు గురై విధులు నిర్వహించని కార్మికుల పిల్లలకు కంపెనీలో ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కౌశిక హరిది మాత్రమేనని అన్నారు. కార్మికులకు రావాలసిన బేసిక్‌ల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పలుసార్లు యాజమాన్యంతో చర్చలు జరిపి సీరియల్ ప్రకారంగా 18 మందికి పదోన్నతులు కల్పించారని తెలిపారు. అలాగే దీపావళి బోనస్ కూడా సకాలంలో చెల్లించాలని కోరారని తెలిపారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, ముఖ్యసలహాదారులు బత్తిని సతీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు ముల్కల్ల కొమురయ్య, పెరుమండ్ల రమేష్, దాడి బాపు, భైరం మల్లయ్య, తీగెల తిరుపతి, భైరి రామకృష్ణ, సాదిక్, కొమురయ్య, పూసాల ప్రసాద్, వెంకటేష్, కండె స్వామి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి నాగరాజుతో పాటు పలువురు కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



రీజినల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌వోటూ జీఎం

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలో వర్క్‌పీపుల్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే రీజినల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. రిజినల్ స్థాయిలో జరిగే పోటీల్లో ఆర్జీ-3, ఏపీఏ, భూపాల్‌పల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య జరిగే పోటీలను ఏపీఏ ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ ప్రారంభించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సింగరేణికి గుర్తింపు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగేశ్వర్‌రావు, సుదర్శనం, సునీల్‌ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్సా శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ నరసింహారెడ్డి, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్న పుట్ట మధు'

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల బోనస్ విషయంలో జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని మాట్లాడాలని హితవు పలికారు. ప్రైవేట్ సుశీ కంపెనీలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వకుండా వెళ్లిపోయిందని, అందుకు శ్రీధర్‌బాబే కారణమంటూ చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. కార్మికులకు బోనస్ చెల్లించిన అనంతరమే సుశీ కంపెనీకి సంబంధించిన లావాదేవీలను సింగరేణి క్లియర్ చేస్తుందన్నారు. కాంట్రాక్టు కార్మికుల సంక్షేమాన్ని, ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును జీర్ణించుకోలేక అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. తెలిసీతెలియని అజ్ఞానంతో పుట్ట మధు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్‌రెడ్డి, బత్తుల రమేశ్, రామిళ్ళ మనోహర్‌రెడ్డి, రాజకుమార్, ఉడుత శంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బదిలీ వర్కర్లలో 190/ 240 మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్‌లుగా రెగ్యులరైజ్ చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మంద నరసింహారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్‌గ్రౌండ్, సర్ఫేస్‌లలో పనిచేస్తున్న బదిలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేస్తామని గతంలో యాజమాన్యం ప్రకటించినా ఇప్పటి వరకు అమలుచేయలేదని తెలిపారు. యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వకుండా రాజకీయ ఒతిత్తడిలకు తలొగ్గి ఇతరులకు ఇస్తున్నారని, దీంతో యాక్టింగ్ చేస్తున్న కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బదిలీ వర్కర్లకు అన్యాయం జరుగుతున్నా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు స్పందించడం లేదని, కేవలం సర్క్యులర్లు పట్టుకుని వేదికల మీద పోజులు ఇస్తున్నారని నరసింహారావు ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులు చెప్పిన వారికే ఆర్డర్లు ఇస్తున్నారనే అనుమానాలు కార్మికుల్లో నెలకొన్నట్టు నరసింహారావు పేర్కొన్నారు. కార్మికుల్లో యాజమాన్యం పట్ల నమ్మకం కలగాలంటే భవిష్యత్తులో మస్టర్లు పూర్తి చేసిన వెంటనే బదిలీవర్కర్లకు ప్రతి జనవరిలో రెగ్యులరైజ్ చేసే విధానాన్ని అమలు చేయాలని నరసింహారావు సూచించారు. యాక్టింగ్ చేస్తున్న కార్మికులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. యాజమాన్య నిర్లక్ష ధోరణితో కార్మికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు.

ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు, ఆర్జీ-2 ప్రెసిడెంట్, సెక్రెటరీలు వినయ్, ప్రవీణ్‌కుమార్, నాయకులు ఉల్లి మొగిలి, ఎస్ వెంకన్న, సంతోష్, రాంప్రసాద్, సంపత్ పాల్గొన్నారు.

మైన్స్ రెస్క్యూ పోటీల విజేతలకు జీఎం అభినందన


విజేతలను అభినందిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏపీఏ డివిజన్ మైన్స్ రెస్క్యూ పోటీల విజేతలను శనివారం జీఎం వెంకటేశ్వర్లు అభినందించారు. ఈనెల 16,17 తేదీ ల్లో జరిగిన 53వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలలో బెస్ట్ ఇన్ థియరీ, రెస్క్యూ అండ్ రికవరీలో ప్రథమ స్థానం, ఉత్తమ రెస్క్యూ సభ్యులు మొదటి, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. అదేవిధంగా బెస్ట్ క్యాప్టెన్, ఒవరాల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఏపీఏలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం వెంకటేశ్వర్లు జట్టు సభ్యులను అభినందించారు. ఈ కార్య క్రమంలో అధికారులు సత్యనారయణ, కొలిపాక నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీ హెడ్ ఓవర్‌మెన్ మృతి

గోదావరిఖని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఓసీపీలో హెడ్‌ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న కుక్క సురేష్ (40) శనివారం రాత్రి మృతిచెందాడు. గోదావరిఖని పరుశరాంనగర్‌కు చెందిన సురేష్ మధ్యాహ్నం చాతిలో నొప్పి రావడంతో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేరాడు. నొప్పి తీవ్రతరం కావడంతో వైద్యులు కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించగా బంధువులు హైదరాబాద్‌కు రెఫర్ చేయాలని కోరారు. సాయంత్రం సురేష్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. రామగుండం మున్సిపల్ కార్యాలయం వరకు వెళ్లగానే సురేష్ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరిగి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రికి వచ్చేలోపే సురేష్ మృతి చెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే సురేష్ మృతిచెందాడని బంధువులు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి ఆరోపించారు.

నాణ్యత లేని చేప పిల్లలు మాకొద్దు..

(5వ పేజీ తరువాయి)

పోసుకుంటామని మత్స్యకారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టెండర్లను రద్దు చేసి నగదు సొమ్ము ఇవ్వాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

● చేప పిల్లలకు బదులు నగదు అందజేయాలి..

- కొలిపాక నర్సయ్య, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం తాత్కాలిక చైర్మన్

నాణ్యత లేని, తక్కువ సైజు చేప పిల్లలను చెరువులు, కుంటల్లో పోయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఆ వెంటనే అవి చనిపోతాయి. వారం రోజుల నుంచి జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల పంపిణీ చేపట్టారు. నాణ్యత లేని, తక్కువ సైజుగల చేప పిల్లలను పోసేందుకు కాంట్రాక్టర్లు తీసుకరాగా వాటిని తిరస్కరించాం. అంతర్గాం, పాలకుర్తి, రామగుండం, మంథని మండలాల్లోని చెరువుల్లో చేప పిల్లల పోయడాన్ని మత్స్యకారులు అడ్డుకుంటున్నారు. జూన్, జూలై మాసంలోనే చేప పిల్లలు పోయాల్సి ఉండగా, మూడు నెలలు ఆలస్యం చేయడం వల్ల ప్రయోజనంలేదు. చేప పిల్లలకు బదులు సంఘాలకు నగదు పంపిణీ చేస్తే, సకాలంలో నాణ్యతగల వాటిని కొనుగోలు చేసి పెంచుకుంటాం. దీనివల్ల మాకు లాభం చేకూరుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి నగదు పంపిణీ చేయాలి.

కమ్యూనిస్టు సీనియర్ నేత రాజేశ్వర్‌రావు మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, ఉమ్మడి జిల్లా సీపీఐ కార్యదర్శి, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గంద్ర రాజేశ్వర్‌రావు(75) శనివారం హైదరాబాద్‌లో మృతిచెందారు. 1980-90లో ఆయన పేదల కోసం అనేక పోరాటాలు చేశారు. మరోవైపు పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేశారు. ఆనాటి శాసన సభ్యులు చెన్నమనేని రాజేశ్వర్ రావు, దేశిని చిన్నమల్లయ్య ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించారు. ఆయనకు భార్య సత్యవతి, కుమారుడు కిరణ్, కోడలు ఉండగా వీరందరూ అమెరికాలో ఉంటున్నారు. కూతురు కరుణశ్రీ హైదరాబాద్‌లో ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఎలిగేడు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుర్రం మల్లారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. శనివారం ఆయన కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ స్రవంతిమోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భైరెడ్డి రాంరెడ్డి, నాయకులు న్యాతరి పోచయ్య, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపెల్లి రాజేశం, రాజేశ్వరెడ్డి, తీపిరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సుందిల్లలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శనివారం చైల్డ్ హెల్ప్‌లైన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కౌన్సిలర్ రేనుకుంట్ల సతీష్ బాల్య వివాహాలు, బాల కార్మికులు, బడి బయట పిల్లలు, తప్పిపోయిన చిన్నారులు, పోక్సో చట్టం, అనాథలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. విద్యార్థులు, చిన్నారులకు ఎటువంటి ఆపద ఉన్నా 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. 24 గంటలు ఈ నంబర్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు పాల్గొన్నారు.